క్లుప్తంగా

కళకళలాడుతున్న గోదావరి


వలందర్‌రేవు వద్ద వశిష్ట గోదావరి నీటి ప్రవాహం క్రమంగా పెరుగుతున్న దృశ్యం

నరసాపురం: సీజన్ కావడంతో కొన్ని రోజులుగా వర్షాలు పడుతున్నాయి. ముఖ్యంగా ఎగువ ప్రాంతాల్లో వర్షం పాతం ఎక్కువగా నమోదు కావడంతో నరసాపురం వశిష్ట గోదావరి నీటి ప్రవాహం క్రమంగా పెరుగుతుంది. గత నెలతో పోలిస్తే స్థానికంగా నీటిమట్టం స్వల్పంగా పెరుగుతోంది. వలంధర్‌రేవు వద్ద చాలా రోజుల తరువాత పరవళ్లు తొక్కుతూ గోదావరిలో నీటి ప్రవాహం కనిపించింది.

హాస్టల్ తనిఖీ చేసిన కమిషనర్


హాస్టల్‌లో పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలిస్తున్న కమిషనర్

నరసాపురం: పట్టణంలోని 19వవార్డులో ఉన్న బీసీ బాలుర హాస్టల్‌ను శనివారం మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ వద్ద పారిశుద్ధ్య పరిస్థితిని పరిశీలించారు. అలాగే విద్యార్థులు పడక గదులు, స్నానపు గదులు, మరుగుదొడ్లు, టాయిలెట్స్ పరిశీలించారు. వ్యాధుల సీజన్ కావడంతో పరిశుభ్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హాస్టల్ వార్డెన్‌కు సూచించారు. హాస్టల్ పరిసరాల్లో ముగ్గు, ఎంఎల్ ఆయిల్ చల్లించారు. ఆయన వెంట ఏఈ సునీల్ తదితరులు ఉన్నారు.

మానవత సేవలు విస్తరించాలి


ప్రమాణస్వీకారం చేసిన మానవత నూతన కార్యవర్గం

పెనుగొండ: మానవత అందిస్తున్న సేవలు మరింత విస్తరింపచేయాలని ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కె.రామచంద్రరాజు అన్నారు. శుక్రవారం రాత్రి పెనుగొండ లో నిర్వహించిన నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి హజరయ్యారు. అధ్యక్షుడుగా డాక్టర్ నల్లిమిల్లి విజయరాజు, కార్యదర్శిగా షేక్ మస్తాన్, కోశాధికారిగా యలమర్తి నరసింహరావు, ఉపాధ్యక్షుడుగా కొమ్ముల రామకృష్ణ, సహాయ కార్యదర్శిగా నూలి నవీన్ కుమార్, అనుబంధ కన్వీనర్లుగా మేడపాటి మురళీ జోగిరెడ్డి, తానేటి జెమీమా, కంబాల మోహన్, రామోజు కృష్ణకిషోర్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, విస్తరణ కమిటీ కన్వీనరు కోడూరి రాధా పుష్పవతి, జిల్లా కార్యదర్శి కొత్త సత్యనారాయణ మూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీపీ అప్పారావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కేవీఆర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వలాభం కోసం ఎస్సీ వర్గీకరణ


గుమ్మాపు సూర్యవరప్రసాద్

పాలకొల్లు (సెంట్రల్): కుప్పం పర్యటనలో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబూనాయుడు జిల్లాల వారీగా ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పటం భారత రాజ్యాంగాన్ని కించపరచటమేనని పీవీ రావు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్యవరప్రసాద్ రావు అన్నారు. ఎస్సీ వర్గీకరణ చెల్లదని గతంలోనే సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా కేవలం రాజకీయ స్వలాభం కోసం అన్న దమ్ములుగా కలిసున్న మాల, మాదిగల మధ్య అగాధం సృష్టిస్తున్నారన్నారు. కేవలం మాదిగలు మాత్రమే ఓట్లు వేస్తే టీడీపీ కూటమి అధికారంలోకి రాలేదని అది చంద్రబాబూనాయుడు గమనించాలన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో ప్రయత్నాలు విరమించుకోవాలని కోరారు.

మండలపరిషత్‌కే ఫెర్రీ నిర్వహణ బాధ్యత


నరసాపురం మండలపరిషత్ కార్యాలయంలో ఫెర్రీ వ్యవహారంపై సమావేశమైన జేఏసీ సభ్యులు

నరసాపురం రూరల్: మండలంలోని మాధవాయిపాలెం ఫెర్రీ పాటదారుడు రూ.50 లక్షలకు పైగా ప్రభుత్వానికి బకాయి పడటంతో ఫెర్రీ నిర్వహణ బాధ్యతను నరసాపురం మండలపరిషత్ ఆధ్వర్యంలో జరగాలని జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నిర్ణయించింది. శనివారం నరసాపురం ఎంపీడీఓ కార్యాలయంలో ఉభయ జిల్లాల జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. పాటదారుడు గత ఆర్థిక సంవత్సరం బకాయి, ఎన్నికల కోడ్ కారణంగా ఈ ఆర్థిక సంఘం రేవుపాట నిర్వహించనందున రోజువారీ చెల్లింపుల ప్రాతిపదికపై పాత పాటదారునికే ఉన్నతాధికారుల ఆదేశాలతో రేవు నిర్వాహణా బాధ్యతలు అప్పగించారు. పాత, కొత్త బకాయిలు వెరశి రూ.53 లక్షలకు చేరడం, పాటదారుడు అధికారుల ఆదేశాలకు అనుగుణంగా చెల్లింపులు చేయకపోవడం తదితర కారణాలతో అతని నుండీ రేవు నిర్వహణ స్వాధీనం చేసుకుని నరసాపురం మండల పరిషత్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందితో నిర్వహించాలని జేఏసీ నిర్ణయించింది.

జూలై 3 నుంచి నిర్వహణ

జూలై 1,2 తేదీల్లో సామాజిక పింఛన్ల పంపిణీ ఉన్నందున జూలై 3 నుంచి రేవు నిర్వహణా బాధ్యత మండల పరిషత్ ఆధీనంలోకి రానుంది. అయితే ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలిన కాలానికి రేవు నిర్వహణా బాధ్యతలను అప్పగించేందుకు ఇప్పటికే టెండర్లు పిలిచారు. షెడ్యూల్ ప్రకారం 7వ తేదీ రేవు పాట జరగాల్సి ఉంది. సఖినేటిపల్లిలంక వాసులకు రేవులో రాకపోకలు ఉచితంగా సాగించేలా అవకాశం కల్పించాలని సర్పంచ్ రేవూరి ఏసు నర్సింహరాజు వినతి పత్రం అందజేశారు. సాంప్రదాయంగా రేవు ఏర్పడిన నాటి నుంచి లంకవాసులకు ఈ సౌకర్యం ఉందన్నారు. రేవు పాట దారుని దృష్టికి ముందుగానే ఈ విషయాన్ని అధికారులు తీసుకువెళ్లి భవిష్యత్‌లో సఖినేటిపల్లిలంక వాసుల మనోబావాలు దెబ్బతినకుండా చూడాలని సర్పంచ్ ఆ వినతి పత్రంలో కోరారు. సమావేశంలో నరసాపురం, సఖినేటిపల్లి ఎంపీపీలు మైలాబత్తుల సోని, మల్లికార్జునరావు డీఎల్పీవోలు శ్రీనివాసు, బొజ్జిబాబు, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ, ఎంపీడీఓ రమణరావు తదితరులు పాల్గొన్నారు.

నీట్ అర్హత పరీక్షను రద్దు చేయాలి


ముద్దాడ గణేష్ భవాని

పాలకొల్లు అర్బన్: కేంద్ర ప్రభుత్వం వైద్య విద్యార్హత పరీక్ష నిర్వహణకు నియమించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ద్వారా జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ అర్హత పరీక్షలను రద్దు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెశిడెంట్ ముద్దాడ గణేష్ భవాని డిమాండ్ చేశారు. ఈ మేరకు పాలకొల్లులో శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. లీకేజీకి పాల్పడిన వ్యవహారంలో సుప్రీంకోర్టు ప్రస్తుత న్యాయమూర్తితో విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. నీట్ అర్హత పరీక్ష నిర్వహణ విషయంలో లీకేజీకి అవకాశం కల్పించడం దురదృష్టకరమని వివరించారు. దీనికి కేంద్రప్రభుత్వంతో పాటు ఎన్‌టీఏ కూడా బాధ్యత వహించాలని పేర్కొన్నారు. ఎన్‌టీఏ వల్లనే దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు రోడ్డున పడ్డారని పేర్కొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం


కేసులు పరిష్కరిస్తున్న 10వ అదనపు జిల్లా జడ్జి విజయదుర్గ



లోక్ ఆదాలత్‌లో పాల్గొన్న జడ్జి జియావుద్దీన్

నరసాపురం: రాజీ మార్గమే రాజమార్గమని నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జి పి.విజయదుర్గ అన్నారు. శనివారం జాతీయలోక్ అదాలత్‌ను నరసాపురం కోర్టు సముదాయంలో నిర్వహించారు. అదాలత్‌లో మొత్తం 109 కేసులు రాజీ చేసి పరిష్కరించారు. ఈ సందర్భంగా జడ్జి విజయదుర్గ మాట్లాడుతూ పెండింగ్‌లో ఏళ్ల తరబడి నలుగుతున్న కేసులను పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ చక్కని వేదికని అన్నారు. కేసులు రాజీ చేసుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయని చెప్పారు. అనవసర తగవులతో కోర్టుల వరకూ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. లోక్ అదాలత్‌లో మొత్తం 4 బెంచ్‌లు ఏర్పాటు చేసి కేసులు పరిష్కరించారు. జడ్జిలు జి.గంగరాజు, ఆర్ వరలక్ష్మి, కె.శ్రీనివాస్‌లు బెంచ్ అధికారులుగా వ్యవహరించారు.

పాలకొల్లులో 72 కేసులు పరిష్కారం

పాలకొల్లు సెంట్రల్: కోర్టు కేసుల్లో స్నేహపూర్వకమైన పరిష్కారం పొందాలంటే లోక్ అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతుందని న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జియావుద్దీన్ షేక్ అన్నారు. శనివారం పట్టణ కోర్టు ఆవరణలో జరిగిన జాతీయ లోక్ అధాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి జియావుద్దీన్ మాట్లాడుతూ వాదించుకోవడం వల్ల ఒక్కరే గెలుస్తారని ఇలా లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవడం వల్ల ఇరువురూ గెలుస్తారని అన్నారు. ఈలోక్ అదాలత్ ద్వారా 72 కేసులు పరిష్కారం అవ్వగా రూ. 45,56,085 నగదు కక్షిదారులకు పరిహారం అందిందన్నారు. ఈ కార్యక్రమంలో లోక్ ఆదాలత్ మెంబర్ జక్కంశెట్టి వెంకటేశ్వరరావు, బార్ అసోసియేషన్ సెక్రటరీ వేదాల నాగరాజు, పట్టణ, రూరల్ సీఐలు, పట్టణ, రూరల్, పోడూరు, ఆచంట ఎస్సైలు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



వాటర్ టిన్‌లు అందిస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. శనివారం డాన్ టు డెస్క్ 2024 పలు సేవా కార్యక్రమాల్లో భాగంగా పట్టణంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో అంధులకు చేతి కర్రలు, వీది వ్యాపారులకు గొడుగులు, విద్యార్థులకు విద్యా కిట్లు, నేత్ర అవయవదానాన్ని ప్రోత్సహించడం, జీవీఎస్‌వీఆర్‌ఎం మునిసిపల్ ప్రైమరీ పాఠశాల, ఎంపీపీ పాఠశాల ఈ రెండు ప్రభుత్వ పాఠశాలలకు 500 లీటర్ల సామర్థ్యం ఉన్న వాటర్ ట్యాంకులు బహూకరించారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వీసీఐ జాయింట్ సెక్రటరీ దొడ్డ మోహనరావు ముఖ్య అతిథిగా విచ్చేసి పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో గౌరవ అతిథి మానేపల్లి నాగేశ్వరరావు, అధ్యక్షుడు మూటూరి సోమేశ్వరరావు, సెక్రటరీ మాఘం నారాయణరావు, ట్రెజరర్ మాఘం శ్రీనివాసరావు, ఎస్.కామేశ్వరరావు, ప్రవీణ్ భాను, ఇమ్మిడి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మందుల పంపిణీ


వృద్ధులకు మందులు పంపిణీ చేస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పేదలకు విద్య, వైద్యంలో సహాయ సహకారాలు అందించడానికి వాకర్స్ క్లబ్ ఎప్పుడూ తోడు ఉంటుందని పట్టణ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకరరావు అన్నారు. శనివారం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నలుగురు వృద్ధులకు రూ. 20 వేలు విలువ చేసే మందులను అందజేశారు. అలాగే ఒక వృద్ధురాలికి కంటి చికిత్స చేయించారు. ఈ సందర్భంగా సుధాకరరావు మాట్లాడుతూ పేదలకు సహకారం అందించడంలో తమ క్లబ్ సభ్యులు తోడ్పాడు ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు షేక్ పీర్ సాహెబ్, మానెం బసవరాజు, పోతుల ఉమాశంకరరావు, జవ్వాజి కళ్యాణ్, ధనాని శ్రీరామమూర్తి, సలాది రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణాంక దినోత్సవం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ గణాంక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. శనివారం గణాంక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గణాంకశాస్త్ర పితామహుడు పిసి మహాలనోబిస్ శాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజ రాజేశ్వరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం



సివిల్ రైట్స్ డే సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్

పాలకొల్లు అర్బన్: చట్టాలను అమలు చేయాల్సిన అధికారులే ఆ చట్టాలను దుర్వినియోగం చేస్తున్నారని రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ ఆందోళన వ్యక్తం చేశారు. పాలకొల్లు మండలం దిగమర్రు పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం సివిల్ రైట్స్ డే సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు హాజరుకాకపోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్సై, తహసీల్దార్ హాజరు కాకపోవడంపై డీఎస్పీ, ఆర్డీవోలకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. దీనిపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనిపై తాను ఎస్పీ, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళతానన్నారు. గైర్హాజరైన మండల స్థాయి అధికారులందరికీ సమన్లు జారీ చేసి కమిషన్‌కి రప్పిస్తామన్నారు. రాష్ట్రంలో అనేక గ్రామాల్లో ఎస్సీలపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలను అంటరానివారిగానూ, సాంఘిక బహిష్కరణ చేస్తుంటే అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవడం లేదన్నారు. చట్టాలను అధికారులే నిర్వీర్యం చేస్తున్నారన్నారు. దళిత చట్టాలను అమలు చేయకపోతే పేద వర్గాలకు న్యాయం ఎలా జరుగుతుంది? అని ఆయన ప్రశ్నించారు. మండల స్థాయి అధికారులు హాజరుకాలేదంటే దళితుల పట్ల ఎంత కఠినంగా ఉన్నారో అర్థమవుతుందన్నారు. దళితుల పట్ల అనేక చోట్ల దాడులు జరుగుతున్నాయన్నారు. మండల స్థాయి ఎస్సై సివిల్ రైట్స్ డేని నిర్వహించాల్సి ఉందన్నారు. దళిత చట్టాలను గ్రామంలో ప్రజలకు తెలియజేయాలని, దళితులను కించపరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై చెప్పాలని, అయితే ఆయనే సమావేశానికి రాకపోవడం విచారకరమన్నారు. సమావేశంలో ఆర్ఐ కె.వరలక్ష్మి, ఈఓపీఆర్‌డీ కేఎం వైభవతి, వీఆర్వో బళ్ల రాజు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ వి అనిత తదితరులు పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీరు తాగడం ఉత్తమం


పిట్టావారిపేటలో నిర్వహించిన శిబిరంలో రోగులను పరిక్షిస్తున్న డాక్టర్ లక్ష్మీ పార్వతి

మొగల్తూరు: మారిన వాతావరణం నేపథ్యంలో ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు లక్ష్మీ పార్వతి సూచించారు. శనివారం మండలంలోని రామన్నపాలెం-1 సచివాలయ పరిధిలోని పిట్టావారిపేటలో డాక్టర్ లక్ష్మీ పార్వతి, కేపీ పాలెంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో నీరు కలుషితమవుతుందని, ప్రతి రోజూ కాచిచల్లార్చిన నీటిని తాగాలన్నారు. గ్రామంలోని బాలింతలను, గర్భిణులను, చిన్నారులను లేవలేని పరిస్థితిలో ఉన్న రోగులను పరీక్షించారు. ఈ సందర్భంగా సచివాలయానికి వచ్చిన వారితో పాటు గ్రామంలోని రోగులను సుమారు 96 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది జ్ఞానరత్నం, రేవతి, మరయమ్మ, జాన్సి పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

మొగల్తూరు: సామాజిక పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ వి.బాబ్జిరాజు శనివారం తెలిపారు. మండలంలోని 17 గ్రామాలకు సంబంధించి 10,786 మంది పింఛన్ లబ్ధిదారులుండగా రూ.7,17,47000ను సోమవారం ఉదయం ఆరు గంటల నుంచి సచివాలయ ఉద్యోగులతో పాటు పంచాయతీ ఉద్యోగులు పింఛన్‌లను పంపిణీ చేస్తారన్నారు. వృద్ధాప్య, వితంతువు,కల్లుగీత కార్మికులకు, మత్స్యకార ,ఒంటరి మహిళలకు, వికలాంగులకు పింఛన్ అందిస్తారని పేర్కొన్నారు.

మార్టేరులో

పెనుమంట్ర: ఆచంట నియోజకవర్గ స్థాయిలో ఫించన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం మార్టేరులోని శ్రీవేణుగోపాల ఆడిటోరియంలో ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ప్రారంభిస్తారని పెనుమంట్ర ఎంపీడీఓ పద్మజ శనివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జరిగే ఈకార్యక్రమంలో ఆచంట నియోజవర్గానికి చెందిన నాలుగు మండలాల నుంచి ప్రజా ప్రతినిధులు, పెన్షన్ లబ్ధిదారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె కోరారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: మండలంలోని 22 గ్రామ సచివాలయాల పరిధిలోని 9,215 మంది లబ్ధిదారులకు రూ.6,17,26,500 మంజూరైనట్లు ఎంపీడీఓ బి.అనుపమ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 1వ తేదీన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, ఇతర సిబ్బంది 191 మందితో పింఛన్ లబ్ధిదారుల ఇళ్ల వద్ద పింఛన్ సొమ్ములు అందజేయడానికి అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు.

రోడ్లపై దూడలు, ఆవుల హల్‌చల్


పట్టణంలోని గోదావరి బండ్ పుట్‌ఫాత్‌పై ఆవులు, దూడలు

నరసాపురం: పట్టణంలో రోడ్లు నిండా దూడలు, ఆవులు హల్‌చల్ చేస్తున్నాయి. ప్రధాన సెంటర్‌లలో పెద్ద సంఖ్యలో ఆవులు, దూడలు తిరుగుతున్నాయి. దీంతో వాహనదారులకు, బాటసారులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. యజమానులు మార్కెట్ ప్రాంతంలో దూడలు వదిలేస్తున్నారు. మార్కెట్‌లో సరుకులు కొనుగోలు చేసి, మోటార్ సైకిళ్లకు తగిలించుకుంటే అకస్మాత్తుగా వచ్చి దూడలు తినేస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో మనుషులపై దూడలు దాడిచేస్తున్న సంఘటనలు కూడా జరుగుతున్నాయి. మరోవైపు పారిశుద్ధ్య ఇబ్బందులు కూడా పెరుగుతున్నాయి. దూడల యజమానులకు వాటిని కట్టడి చేసుకోవాలని, రోడ్లపైకి వదలకూడదని మునిసిపల్ అధికారులు కేవలం హెచ్చరికలు చేసి చేతులు దులిపేసుకుంటున్నారు. కానీ ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. దీంతో సమస్య పరిష్కారం కావడం లేదు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని పట్టణ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

జవహర్ సేవలు ఆదర్శనీయం

పెనుగొండ: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడానికి గురువు భూపతిరాజు జవహర్‌లాల్ రాజు అందించిన సేవలు ఆదర్శనీయమని పెనుగొండ ఎంఈఓ డి.శుభాకరరావు అన్నారు. జవహర్‌రాజు పదవీ విరమణ సందర్భంగా పెనుగొండ ఎస్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో జవహర్‌రాజును శనివారం పెనుగొండలో ఘనంగా సత్కరించారు.

నేడు ఆప్తా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని ఎంఎంకేఎస్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో ఆప్తా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నారు. పట్టణంలోని ఎంఎంకేఎస్‌ఎం హైస్కూల్లో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థి ఎస్‌ఆర్‌ఐ వీరా సతీష్ అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్తా) ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. నిర్వాహకులు వీరా సతీష్ మాట్లాడుతూ అమెరికాలో ఉన్న తెలుగు వారు ఏర్పాటు చేసిన ఆప్తా ద్వారా స్వగ్రామంలో సేవా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. దానిలో భాగంగా ఆదివారం ఉదయం పాలకొల్లులో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ వైద్య శిబిరంలో గుండె, కిడ్నీ, చర్మవ్యాధులు, దంతాలు, చిన్నపిల్లలు, జనరల్ చికిత్సలకు సంబంధించిన వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. అనంతరం అవసరమైన వారికి మందులు కూడా ఉచితంగా అందజేస్తామని పేర్కొన్నారు. పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు ఈ వైద్య శిబిరంలో పాల్గొని వైద్య సదుపాయం పొందవచ్చన్నారు.

రెండో విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలి

పెనుగొండ: ఆచంట ప్రభుత్వ ఐటీఐలో 2024-25 సంవత్సరానికి గాను రెండవ విడత కౌన్సిలింగ్‌కు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఇందుకూరి వెంకట సత్యనారాయణ శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని ధృవ పత్రాల నకళ్లను స్వయంగా జూలై 24వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఆచంట ఐటీఐ కళాశాలలో అందించాలని సూచించారు. అనంతరం 27వ తేదీన ఉదయం 10గంటలకు ఒరిజినల్స్‌తో ఆచంట ఐటీఐలో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 94901 11002ను సంప్రదించాలని కోరారు. ఎస్ఎస్‌సీ మార్కు మెమో (ఇంటర్నెట్ కాపీని ప్రధానోపాధ్యాయుని సంతకంతో), కుల ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజు ఫోటో, ఆధార్ కార్డు, సమర్పించాలని కోరారు.

ఉపాధి హామీ పథకం జిల్లా జేఏసీ ఏర్పాటు


ఐక్యతా చిహ్నం చూపుతున్న ఉపాధి హామీ పథకం జిల్లా స్థాయి జేఏసీ సభ్యులు

పాలకొల్లు అర్బన్: ఉపాధి హామీ పథకం జిల్లా స్థాయి జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగింది. ఈ సమావేశానికి జిల్లాలోని 20 మండలాలకు చెందిన ఏపీవో, ఈసీ, టీఏ, సీవో, ఫీల్డ్ అసిస్టెంట్, అన్ని కేడర్లకు చెందిన ఉద్యోగులు హాజరై నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా కొల్లి శ్రీనివాస్, చైర్మన్‌గా మారంపూడి బాపూజీ, వైస్‌చైర్మన్‌గా యల్లమిల్లి శ్రీనివాస్, దుర్గా వెంకటరమణ, కార్యదర్శిగా డీఎం శర్మ, జాయింట్ సెక్రటరీలుగా వర్ధనపు ఆనంద్, డి చంద్రప్రకాష్, కె.నాగేంద్ర, కోశాధికారులుగా వి.రేవతి, ఎన్‌ఆర్‌ఆర్‌టీ వర్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె.శ్రీనుతో పాటు 11 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.